● సీఎంకు సత్కారం



హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ సత్యం, నంద గోపాల్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ 1 పరిధిలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈలు విజయభాస్కర్, వినోద్‌కుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆజామాబాద్ 11 కేవీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, శంకర్‌మఠ్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, హిమాయత్‌నగర్, రేణుకా ఎన్‌క్లేవ్ పరిధిలో 10 నుంచి 1 గంట, జేఎన్ ఫీడర్, కపాడియా పరిధిలో 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

రాంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ జెండాగల్లీలో ఏడు లక్షల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, కె సురేందర్, నాయకులు ఎండి జహంగీర్, జెల్ల బిక్షపతి, కదిర్, మొయిద్‌ఖాన్, బొట్టు శ్రీనివాస్, ప్రభాకర్, గురుదీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి బానుతేజస్వికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రవికుమార్ తదితరులు

ప్రపంచ శాంతి కోసం కవులు గళమెత్తాలి

రాంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో జరుగుతున్న అణ్వాయుధ యుద్ధాలు, అల్లర్లకు వ్యతిరేకంగా కవులు కలమెత్తి కవితలు వినిపించి శాంతిస్థాపన కోసం పాటుపడాలని నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు మారేపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవభారత్ నిర్మాణ సంఘం ఐపీవైజీ, హెచ్‌డబ్ల్యూపీఎల్ (కొరియా) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచ శాంతి- రచయితల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. లక్షల మెదళ్లను కదిలించే శక్తి ఒక కలానికి మాత్రమే ఉంటుందన్నారు. కానూరి కొలగాని బాను తేజస్వి తనశైలిలో కవితలు వినిపించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రపంచ శాంతి కోసం బాను తేజస్వి చేస్తున్న కృషిని గుర్తించి నిర్వాహకులు ఆమెను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వామన్‌రావు, సమాజ సేవకులు అమృత్‌కుమార్ జైన్, తెలంగాణ ఎడ్యుకేషన్ విభాగం మాజీ డైరెక్టర్ సరోజినిదేవి, వి భారతి, సంస్థ అధ్యక్షుడు మారేపల్లి రవికుమార్‌తో పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

రాంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేసేలా రాహుల్ గాంధీ ఆదేశించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణామాఫీ, రైతు భరోసా, పింఛన్ల పెంపు, ఐదు వందలకు గ్యాస్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 రూపాయలు ఇస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్ గౌడ్, నల్లెల కిషోర్, మేడిపల్లి శ్యామ్, సుందర్, రాజు పాల్గొన్నారు.

● డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కె.రవిచారి జలమండలి అధికారులను కోరారు. బుధవారం శ్రీరామ్‌నగర్‌లో పర్యటించి స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, ఇతర సమస్యలను తెలుసుకున్నారు. మాదవ్‌సింగ్, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

యూజీసీ పేస్కేల్ అమలు చేయండి

చిక్కడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల కు ఉద్యోగ భద్రతతో కూడిన యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని సెంట్రల్ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు కలిసి వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గత 8 నెలల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు యూజీసీ పేస్కేల్ అమలు కోసం చేసిన పోరాటాన్ని వివరించారు. డా. కిరణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

2 నియోజకవర్గాలు.. 11 డివిజన్లలో..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం

రాంనగర్/కవాడిగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో బుధవారం ప్రారంభమైంది. ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ ఖాదర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్‌లు హాజరై ప్రారంభించారు. అంబర్‌పేట సర్వేలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ డి పద్మా వెంకట్‌రెడ్డిలు ప్రారంభించారు. అదేవిధంగా రెండు నియోజకవర్గాల్లోని 11 మునిసిపల్ డివిజన్‌లలో ఆయా డివిజన్‌లకు కేటాయించిన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఈ సర్వేలో ముషీరాబాద్‌లో 588, అంబర్‌పేటలో 720 మంది ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ నోడల్ అధికారి రజిత ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, ఆర్‌పి సుజాత శ్రావణి, బాలమణి, వరలక్ష్మి, కవాడిగూడ నోడల్ అధికారి మధు ఎన్యూమరేటర్లు శిల్పా, అనిత పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక కుల గణన సర్వేను తెలంగాణ జనసమితి పార్టీ స్వాగతిస్తుందని ఆ పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు ఎం నర్సయ్య తెలిపారు

● **సామాజిక న్యాయం కోసమే..**

ముషీరాబాద్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే బుధవారం ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు ముషీరాబాద్‌లోని భరత్‌నగర్, శివాలయం వీధిలో ఇంటింటికీ వెళ్లి సర్వే స్టిక్కర్లను అంటించారు. మొదటి రోజు కేవలం స్టిక్కర్లు అంటించే పని చేశారు. 9వ తేదీ నుంచి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎన్యూమరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు కృష్ణవేణి, స్వప్న గౌడ్‌లు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: కుటుంబ సర్వే కార్యక్రమంలో భాగంగా మొదటి సర్వే వివరాలను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ నివాసం నుంచే ప్రారంభించారు. కార్పొరేటర్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ కలిసి తమ వివరాలను అధికారులకు వివరించారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు సర్వే పత్రాన్ని అందజేస్తున్న అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, అధికారులు



కవాడిగూడ ఉస్నికోటలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా స్టిక్కర్ అతికిస్తున్న ఎన్యూమరేటర్లు

● **గాంధీనగర్ డివిజన్‌లో..**

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో కుల గణన కార్యక్రమాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్, నాయకులు శ్రీకాంత్, పాశం రవి, ముచ్చకుర్తి ప్రభాకర్, నరేష్, పున్న సత్యనారాయణ, రాజమోహన్ ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ సర్వేలో పట్నం నాగభూషణంగౌడ్, ఎన్యూమరేటర్లు



బాగ్‌అంబర్‌పేటలో సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తదితరులు



గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వివరాలు నమోదు చేస్తున్న డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

చిక్కడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ద్విచక్ర వాహనచోదకుడు విధిగా హెల్మెట్ ధరించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం సూచించారు. బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ద్విచక్రవాహనదారులకు హెల్మెట్, రాంగ్‌సైడ్‌లో వాహనాలు నడపడం వల్ల కలిగే ఇబ్బందులు, నష్టాలు వాహనచోదకులకు వివరించారు. ఇన్‌స్పెక్టర్ వీరేశం పర్యవేక్షణలో ఎస్ఐలు, సిబ్బంది తెలియజేశారు. రాంగ్‌సైడ్‌లో వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది దాదాపు రెండు గంటలపాటు వాహనదారులకు అవగాహన కలిగించారు.



వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్రజల మనిషి 'వట్టికోట'



ప్రసంగిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, పక్కన కళాజనార్ధనమూర్తి

చిక్కడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక చింతనతో జీవితాన్ని సమాజశ్రేయస్సుకు అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన వట్టికోట ఆళ్వారుస్వామి యాదిలో కార్యక్రమం నిర్వహించారు. జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ కడుపేదరికం నుంచి ఎన్నో బాధలను భరించి తెలంగాణసాహితీ కిరణంగానిలిచిన వట్టికోట ఆళ్వారుస్వామి చరిత్ర నేటి తరాలకు కరదీపిక కావాలన్నారు. జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. ఆళ్వారుస్వామి సదా స్మరణీయులని, ప్రభుత్వాలు ఆయన జయంతిని విధిగా జరిపి అభిమానం చాటుకోవాలన్నారు. గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో యువత ఉపాధి కోసం సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ తరువాత పరీక్షలు నిర్వహించి పాసైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు వ్యవధి 2 నుంచి 6 నెలల వరకు ఉంటుందని చెప్పారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9505800050లో సంప్రదించాలని తెలిపారు.

11న అశోక్‌తేజకు సినారె- ఆళ్ల స్వర్ణ కంకణ ప్రదానం



చిక్కడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న త్యాగరాయగానసభలో వంశీ ఆర్ట్ థియేటర్స్, డా.శ్రీనివాసరెడ్డి ఆళ్ల (అమెరికా) ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గీత రచయిత డా.సుద్దాల అశోక్‌తేజకు సినారె-ఆళ్ల స్వర్ణ కంకణ ప్రదాన వేడుక ఉంటుందని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారంతో సత్కరిస్తారని తెలిపారు. సినీ దర్శకులు బి.గోపాల్, కోదండరామిరెడ్డి, రేలంగి నరసింహారావు, సంగీత దర్శకులు సాలూరి కోటి తదితర ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. అమెరికాలో స్థిరపడ్డ గాయని శారద ఆకునూరి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు మిత్ర, వినోద్‌బాబు, రమణ, ప్రదీప్‌లచే చిరునవ్వుల తొలకరిలో శీర్షికన సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు.

'పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం'

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని లంబాడీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్ ఆరోపించారు. సమస్యలపై వెళితే ఎండీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని ధ్వజమెత్తారు. బుధవారం బర్కత్‌పురలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో అగ్రవర్ణ కులానికి చెందిన అధికారి అయిదు పోస్టులను అక్రమంగా నిర్వహిస్తూ ఎస్టీ ఇంజినీర్లను మానసిక వేదనకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. అర్హులైన అనుభవం కలిగిన ఎస్టీ ఇంజినీర్లకు ఎస్ఈ ప్రమోషన్ రాకుండా, ఎస్టీల్లో అర్హత ఉన్న ఇంజినీర్లను ఈఈ పదోన్నతి పొందకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీని స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

మరో కొత్త ఫుడ్ డెలివరీ యాప్

రెజిమెంటల్‌బజార్ : రెస్టారెంటు యజమానులకు, కస్టమర్‌లకు ప్రయోజనం చేకూరే విధంగా వాయు జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు వాయు యాప్ వ్యవస్థాపకులు మందర్ లాండే, అనిరుధ కోట్‌గిరే తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో యాప్‌ను ప్రారంభించారు. కస్టమర్‌లకు తక్కువ ఖర్చుతో ఆహారాన్ని ఇంటి వద్దకే పంపించడానికి యాప్‌ను హైదారాబాద్‌కు విస్తరించినట్లు తెలిపారు.

ఏవీ కాలేజీలో మోడల్ 'ఐక్యరాజ్యసమితి'

కవాడిగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని సొసైటీ ఫర్ ఇన్‌క్యాలుక్యులేటింగ్ ఎడ్యుకేషన్ న్యూట్రింగ్ ఎన్విరాన్‌మెంట్, సేవింగ్ లైఫ్ ఆఫ్ ఎనిమల్ ఫర్ మదర్ హెల్త్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏవీ కళాశాలలో మోడల్ ఐక్యరాజ్యసమితి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర వ్యాప్తంగా ఉన్న దాదాపు 30 పాఠశాలలు, 20 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మనీష, డైరెక్టర్ హెడ్ అకౌంట్ సిమ్రాన్‌లు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతితోనే అన్ని దేశాలు అభివృద్ధి చెం దుతాయని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని వారు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రపంచంలో అంతరించిపోతున్న జంతు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సూచించారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు ఏవీ కళాశాలలో మోడల్ ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని నిర్వహించామని దీనికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రెండోరోజు గురువారం కూడా ఈ కార్యక్రమం ఉందని వారు పేర్కొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మనిషా, సిమ్రాన్ తదితరులు

మహిళపై అత్యాచారం కేసులో..

ముగ్గురు నిందితుల అరెస్టు

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు నిందితులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు కొండాపూర్‌కు చెందిన మహిళను దుస్తులు ఉతకడానికి అని చెప్పి ఓంనగర్‌లోని తమ రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. పక్క ఇళ్లవారి సహాయంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు మూడు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజాము గచ్చిబౌలీలోని బయో డైవర్సిటీ వద్ద నిందితులు చందు, అజయ్, ఆరీఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఫేషియల్ రికగ్నిషన్ హాజరులో నమోదు కావాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్ హాజరు ప్రక్రియలో నమోదు కావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. ఈ ఆదేశాన్ని అమలు చేయని పక్షంలో సంబంధిత హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ (హెచ్‌ఓడీ)పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం అదనపు కమిషనర్లు, హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ నుంచి వేతనం తీసుకుంటున్న వారంతా ఇతర విభాగాల్లో ఉన్నా ఫేషియల్ రికగ్నిషన్ ప్రక్రియలో తప్పక నమోదు కావాలని సూచించారు. హెచ్‌ఓడీలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విజిటింగ్ అవర్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



శ్యాంసుందర్‌గౌడ్ చేతుల మీదుగా సభ్యత్వ కార్డును అందుకుంటున్న కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ తదితరులు

బీజేపీ సభ్యత్వాన్ని రెట్టింపు చేయాలి

● **మహాకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్**

కవాడిగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు గతంలో కంటే రెట్టింపు చేయాలని బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం కవాడిగూడలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ జి రచనశ్రీతో పాటు మరికొంత మందికి క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలతో పాటు వృద్ధుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం రమేష్‌రాం, మాజీ కార్పొరేటర్ టి రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పూసరాజు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసి మహేందర్ బాబు, ఎ ప్రభాకర్ గంగపుత్ర, మురారి శెట్టి కేశవరాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జి మీసాల విఠల్‌రావు పాల్గొన్నారు.

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్ర చికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎస్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ.పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. చేతిని అతికించడంతో సంతోషంగా ఉన్నానని, త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

అన్ని పార్టీలూ ఎమ్మెల్సీ టికెట్లు బీసీలకే కేటాయించాలి

మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఏ పార్టీ అయితే బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు ఇవ్వదో ఆ పార్టీని ఎన్నికల్లో ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రెండు పట్టభద్రుల నియోజకవర్గాలు నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని, ఈ మూడు నియోజకవర్గాలలో బీసీ అభ్యర్థులనే పోటీలో నిలపాలని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలను పూర్తిగా విస్మరించాయని, కనీసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు టి.రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, జి.మల్లేష్‌యాదవ్, జి.అనంతయ్య, మోదీ రాందేవ్, జోషి రాఘవ, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనం అధికారిక నిర్వహణకు జీవో జారీ

సీఎంకు అఖిల భారత యాదవ మహాసభ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న లక్ష్మణ్‌యాదవ్, బాబూరావుయాదవ్ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్‌యాదవ్, జాతీయ కార్యదర్శి రమేష్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావు యాదవ్, వర్కింగ్ ప్రసిడెంట్ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు బుధవారం తెలిపారు. సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని రాష్ట్రంలోని యాదవులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బుధవారం కాచిగూడలోని యాదవ మహాసభ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... సదరు సమ్మేళనాన్ని రాష్ట్ర పండగా గుర్తించడం సంతోషకరం అని, రాష్ట్రంలోని యాదవులం తా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో ప్రారంభమైన సమగ్ర కులగణన సర్వేలో యాదవులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల పెంపుపై న్యాయపరమైన చిక్కులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో మహాసభ కార్యదర్శులు కన్నె రమేష్‌యాదవ్, లడ్డూయాదవ్, డి.శ్రీనివాస్ యాదవ్, గ్రేటర్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు ఎం.విజయ్‌యాదవ్, కార్యవర్గసభ్యులు మనీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.